సాక్షి అనకాపల్లి

శనివారం, 4, మార్చి, 2023



కనకమ్మకు క్షీరాభిషేక సేవ

విశాఖ: కనకమహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం క్షీరాభిషేక సేవ ఘనంగా నిర్వహించారు. ఈ సేవలో 20 మంది ఉభయదాతలు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూములకు రక్షణ

కశింకోటలో ప్రభుత్వ భూమిలో సర్వే రాళ్ల ఏర్పాటును కలెక్టర్ పరిశీలించారు. వివాదాలకు తావు లేకుండా పనిచేయాలన్నారు.

IIలో

వాతావరణం

అనకాపల్లి టౌన్ : రాగల అయిదురోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి శుక్రవారం తెలిపారు. ఉష్ణోగ్రతలు 34 నుంచి 34.2 డిగ్రీలు, గాలిలో తేమ 67 నుంచి 72 శాతం, గాలి గంటకు 3 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో వీస్తుందన్నారు.

న్యూస్‌రీల్

డీఎస్‌వో సరెండర్

తుమ్మపాల: జిల్లా పౌరసరఫరాల అధికారి (డీఎస్‌వో) కె.వి.ఎస్.ఎం.ప్రసాద్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విధినిర్వహణలో అలసత్వంతో వ్యవహరిస్తూ జిల్లాస్థాయి ఉన్నత సమావేశాల్లో తప్పుడు నివేదికలు సమర్పించడంపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్‌కు ఆమె లేఖ రాశారు. అతని స్థానంలో ఏఎస్‌వో సి.ఎస్.ఆర్.లక్ష్మికి డీఎస్‌వోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. జిల్లా ఏర్పడిన అతి తక్కువ సమయంలోనే పౌరసరఫరాల శాఖ నుంచి ఇద్దరు డీఎస్‌వోలను సరెండర్ చేయడం చర్చనీయాంశమయ్యింది.

బాధ్యతగా వన్యప్రాణుల సంరక్షణ



పక్షులను తిలకిస్తూ ఫొటోలు తీస్తున్న విద్యార్థులు

విశాఖ: వన్యప్రాణుల సంరక్షణను అందరూ బాధ్యతగా తీసుకోవాలని జూ ఇన్‌చార్జి క్యూరేటర్ అనంత్ శంకర్ తెలిపారు. ఇందిరాగాంధీ జూ పార్కులో శుక్రవారం వన్యప్రాణి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు జూ లోపల వాక్‌థాన్ నిర్వహించి వివిధ రకాల పక్షులను పరిశీలించారు. మధ్యాహ్నం తోటగరువు ఉన్నత పాఠశాల విద్యార్థులకు వన్యప్రాణులపై అనంత్ శంకర్ అవగాహన కల్పించారు.

బ్యాలెట్ బాక్సుల పరిశీలన



ఎంపీడీవో కార్యాలయంలో బ్యాలెట్ బాక్సులను పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

అనకాపల్లి రూరల్ : ఈ నెల 13న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరగనున్న పోలింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్టు జిల్లా పంచాయతీ అధికారి ఆర్ శిరీషారాణి తెలిపారు. శుక్రవారం అనకాపల్లి ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో భద్రపరచిన బ్యాలెట్ బాక్సులను ఆమె పరిశీలించారు. అనకాపల్లి, దేవరాపల్లి, మునగపాక మండలాల నుంచి తెప్పించిన సుమారు 330 బ్యాలెట్ బాక్సులను క్షుణ్ణంగా పరిశీలించి, అవి సక్రమంగా పనిచేస్తున్నాయో? లేవో? సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వాటిలో 234 బ్యాలెట్ పెట్టెలు బాగా పనిచేస్తున్నట్టు సిబ్బంది గుర్తించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 49 పోలింగ్ కేంద్రాలకు సుమారు 100 వరకు బ్యాలెట్ బాక్సులు సరిపోతాయి. మరో 100 బాక్సులను ఎక్కడైనా అవసరమైతే పంపించేందుకు వీలుగా రిజర్వ్‌లో ఉంచుతున్నట్టు అనకాపల్లి ఎంపీడీవో కె ధర్మారావు తెలిపారు.

విశాఖ కీర్తి విశ్వవ్యాప్తి

46 దేశాల ప్రతినిధుల సాక్షిగా .. ప్రపంచం గర్వపడే దిగ్గజ పారిశ్రామికవేత్తల ఆగమనంతో విశాఖ మురిసింది. రాష్ట్ర ఆర్థిక రాజధాని విశాఖ పాలనా రాజధానిగా అవతరించనున్న తరుణంలో నిర్వహించిన సదస్సులో పెట్టుబడులు పోటెత్తి.. పరిశ్రమలు క్యూ కట్టడాన్ని సాదరంగా స్వాగతించింది. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో విభిన్న రంగాల్లో వేలకోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ముందుకు వచ్చి, ప్రభుత్వంతో భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చుకోవడంతో విశాఖ ఖ్యాతి విశ్వవ్యాప్తం కానుంది.

– సాక్షి, విశాఖపట్నం



సీఎం జగన్‌తో జీఎంఆర్, ముఖేష్ అంబానీ మాటామంతీ



సదస్సుకు తరలివస్తున్న పారిశ్రామికవేత్తలు

దేశ విదేశాలకు చెందిన పారిశ్రామిక దిగ్గజాలను విశాఖకు తీసుకొచ్చింది రాష్ట్ర ప్రభుత్వం . ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజన్‌తో ఏయూ ఇంజినీరింగ్ మైదానంలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ తొలిరోజు విజయవంతంగా ముగిసింది. ఐటీ, ఐటీ అనుబంధ రంగాలతో పాటు పర్యాటక రంగానికి చిరునామాగా విశాఖపట్నంను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషి.. సమ్మిట్ తొలిరోజు అద్భుత ఫలితాలిచ్చింది. విశాఖ పరిపాలన రాజధానిగా అవతరించబోతోంది.. త్వరలోనే తాను కూడా విశాఖకు రాబోతున్నానంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పునరుద్ఘాటించారు. ఈ నేపథ్యంలో విశాఖలో పెట్టుబడులు పెట్టేందుకు సదస్సులో పలువురు పారిశ్రామిక ప్రతినిధులు ఆసక్తి చూపారు. భవిష్యత్ విశాఖ రూపురేఖలు మారేలా.. ఇక్కడ తమ కార్యలాపాలు విస్తరించేందుకు ప్రభుత్వంతో తొలి రోజున ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఇప్పటికే పలు ప్రభుత్వ, ప్రైవేట్ రంగ యూనిట్లు, పోర్ట్ ఆధారిత మౌలిక సదుపాయాలు, మెడ్‌టెక్ జోన్, టూరిస్ట్ హాట్‌స్పాట్‌లతో విశాఖ అత్యంత బలమైన ఆర్థిక కేంద్రంగా ఆవిర్భవించింది. ఈ నేపథ్యంలో పారిశ్రామిక దిగ్గజాలు విశాఖపట్నం జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు ఎంవోయూలు కుదుర్చుకున్నారు.



వేదికపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పారిశ్రామిక దిగ్గజాలు

- నగరంలో రూ.వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి
- ప్రభుత్వంతో ఎంవోయూలు కుదుర్చుకున్న పరిశ్రమలు, సంస్థలు

బీచ్‌రోడ్డులో ఆరు లైన్ల రాదారి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని, విశాఖ నగరాన్ని అనుసంధానం చేస్తూ నిర్మించాలనుకున్న ఆరు లైన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవేకి కూడా మార్గం సుగమమైంది. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు హాజరైన కేంద్ర జాతీయ రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆరులైన్ల రహదారి నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. పలుమార్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరులైన్ల వైజాగ్ పోర్టు హైవేకు సంబంధించిన ముఖ్యమైన డిమాండ్‌ను తన ముందుంచారని తెలిపారు. 55 కి.మీ మేర రూ.6300 కోట్ల వ్యయంతో అంచనా వేస్తున్న ప్రాజెక్ట్‌ను మంజూరు చేస్తున్నట్లు సభా సమక్షంలో ప్రకటించారు. భోగాపురంలో నిర్మించే అంతర్జాతీయ విమానాశ్రయానికి విశాఖ నగరం నుంచి గంటలోపు వెళ్లేలా అద్భుతమైన రహదారి నిర్మించాలన్నది సీఎం వైఎస్ జగన్ సంకల్పం. ఇప్పటికే దీనికి సంబంధించిన రోడ్ మ్యాప్ పూర్తి చేశారు. ఎంత మేర భూమిని సేకరించాలి.. ప్రభుత్వ భూములు ఎంతమేర ఉన్నాయన్న వివరాలతో ప్రాజెక్ట్ సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిన నేపథ్యంలో త్వరలో ఈ ప్రాజెక్ట్ ప్రారంభం కానుంది.



హాజరైన వివిధ దేశాల పారిశ్రామికవేత్తలు

రెండో రోజున మరిన్ని పెట్టుబడులు

పర్యాటక రంగానికి కేంద్ర బిందువుగా ఉన్న విశాఖ నగరంలో పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పటికే అనేక సంస్థలు ముందుకొచ్చాయి. ఈ ఒప్పందాలన్నీ రెండో రోజైన శనివారం ముఖ్యమంత్రి సమక్షంలో జరగనున్నాయి. స్కై టవర్, స్నో వరల్డ్, వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ స్పోర్ట్స్‌తో పాటు స్టార్ హోటళ్లు, రిసార్టులు, బీచ్ రిసార్టులు.. ఇలా విభిన్నమైన ప్రాజెక్టులు విశాఖకు వచ్చే అవకాశాలున్నాయి.







సమ్మిట్‌కు హాజరైన అసెంబ్లీ స్పీకర్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, రాష్ట్ర ముఖ్య కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, పారిశ్రామికవేత్తలు



దప్పు కళాకారుల ప్రదర్శన



తప్పెటగుళ్ల కళాకారుల విన్యాసాలు

ఉమ్మడి విశాఖలో తొలి రోజున ముఖ్యమైన పెట్టుబడులు ఇలా..

ప్రాజెక్టు	పెట్టుబడులు (రూ.కోట్లలో)	ఉపాధి
ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్ ప్రాజెక్టు	1,10,000	61,000
వైజాగ్ టెక్‌పార్క్ లిమిటెడ్ ఆధ్వర్యంలో డేటా సెంటర్, బిజినెస్ పార్క్, స్కిల్ యూనివర్సిటీ	21,844	39,815
అదానీ గ్రీన్ ఎనర్జీ ఆధ్వర్యంలో అల్లూరి జిల్లాలో పంప్డ్ స్టోరేజ్	6,330	4,000
ఒబెరాయ్ హోటల్	1,350	1,350
టూరిజంలో మరో 10 ప్రాజెక్టులు	1,000	1,500



సదస్సుకు వస్తున్న పలు సంస్థల ప్రతినిధులు

మురిసిన నగరం

- అతిరథ మహారథుల రాకతో కోలాహలం
- విశాఖ బలమైన ఆర్థిక కేంద్రమని అభివర్ణించిన సీఎం జగన్



స్టాల్‌ను పరిశీలిస్తున్న ఔత్సాహికులు




సెల్ఫీ తీసుకుంటూ...

సాక్షి, విశాఖపట్నం : ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న పెట్టుబడుల పండగతో విశాఖ నగరంలో సందడి నెలకొంది. నగరంలో అనేక చోట్ల పండగ వాతావరణం కనిపించింది. ప్రముఖ రాకపోకల హడావుడి, రోడ్ల వెంబడి అలంకరణలతో శుక్రవారం ఉదయం నుంచే వైజాగ్‌లో వాతావరణం మారిపోయింది. ముఖేష్ అంబానీ, కరణ్ అదానీ, నవీన్ జిందాల్, గ్రంధి మల్లికార్జునరావు, కృష్ణ ఎల్లా, అర్జున్ ఒబెరాయ్, దాల్మియా వంటి ప్రఖ్యాత పారిశ్రామిక దిగ్గజాలు, అతిరథ మహారథులు విశాఖలో అడుగిడడం, ఒకేసారి, ఒకే వేదికపై ప్రత్యక్షమవడం వైజాగ్ చరిత్రలో ఇదే తొలిసారి. వీరితో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వంటి ముఖ్య నేతలు, పలువురు వీఐపీలు, వీవీఐపీలు గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పాలు పంచుకోవడంతో నగరం మురిసిపోయింది. 25 చార్టర్డ్ విమానాల్లో ప్రముఖులు నగరానికి విచ్చేశారు. ఉదయం 10.20 నిమిషాలకు సీఎం జగన్ రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీని తోడ్కొని వేదికపైకి వచ్చారు. మధ్య కుర్చీలో ముఖ్యమంత్రి కూర్చోగా ఆయనకు ఎడమ వైపు అంబానీ, కుడి వైపు జీఎమ్మార్ అధినేత జీఎం రావు కూర్చున్నారు. మా తెలుగు తల్లికి మల్లెపూదండ గీతాలాపన అనంతరం జ్యోతి ప్రజ్వలనతో సదస్సుకు శ్రీకారం చుట్టారు. వేదికపై ఉన్న ప్రముఖులు ఒక్కొక్కరుగా ప్రసంగిస్తుండగా, మధ్యలో ఆంధ్రప్రదేశ్‌లో వనరుల లభ్యత, అవకాశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ల ద్వారా తెలియజేశారు. ప్రముఖుల్లో ఆఖరిగా అంబానీ, ఆ తర్వాత ముఖ్యమంత్రి జగన్ ప్రసంగించారు. ప్రముఖులంతా ఐదేసి నిమిషాల చొప్పున ప్రసంగించగా సీఎం 15 నిమిషాలకు పైగా ప్రసంగించారు. సీఎం తన ప్రసంగాన్ని ముగించే ముందు 'విశాఖ బలమైన ఆర్థిక కేంద్రం.. రాబోయే రోజుల్లో విశాఖ కార్యనిర్వాహక రాజధాని అవుతుంది, అందమైన ఈ నగరంలో అద్భుతమైన సమయాన్ని గడపాలని ఆశిస్తున్నాను' అనడంతో సభికుల నుంచి పెద్ద ఎత్తున చప్పట్లు మారుమోగాయి. సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమం పూర్తయ్యాక కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వచ్చారు. ఆ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లతో కూడిన ఎగ్జిబిషన్‌ను గడ్కరీ ప్రారంభించారు.

తొలిరోజు విజయవంతం

ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రముఖులు, పెట్టుబడిదారులు, డెలిగేట్స్, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర రాజకీయ నేతలతో సమ్మిట్ జరుగుతున్న ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ మైదానం కిక్కిరిసి.. కోలాహలంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమ్మిట్ ద్వారా రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేసింది. అయితే తొలిరోజే అందరి అంచనాలను తలకిందులు చేస్తూ ఆరు రెట్లు అధికంగా రూ.11.87 లక్షల కోట్ల విలువైన ఎంవోయూలు కుదిరాయి.

అంబరాన్నంటిన వెంకన్న సంబరం



ఉపమాక క్షేత్రంలో భక్తజన సందోహం

- నేత్రపర్వంగా ధ్వజారోహణం.. ఘనంగా రథోత్సవం
- మంత్రముగ్ధులను చేసిన ఎదురు సన్నాహ మహోత్సవం
- ఉపమాకలో ఘనంగా స్వామి కల్యాణోత్సవాలు



సర్వాభరణాలతో స్వామివారు, దేవేరులు



కొండపై మూలవిరాట్‌కు తొలి అభిషేకం చేస్తున్న అర్చకులు



ఎదురు సన్నాహ మహోత్సవాన్ని ఆసక్తిగా తిలకిస్తున్న భక్తులు

నక్కపల్లి: కమనీయం.. వెంకన్న కల్యాణోత్సవం.. వేలాదిమంది భక్తుల రాకతో ఉపమాక అంతటా కోలాహలం.. కలియుగ వైకుంఠనాథుని తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు గరుడాద్రి పర్వతంపై మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం, తొలిపూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామిని పెద్దపల్లకిలో ఉంచి ఉపమాక మాడవీధుల్లో తిరువీధి సేవ నిర్వహించారు. అనంతరం ఆలయంలో ధ్వజస్తంభం వద్ద ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు వేద మంత్రోచ్ఛారణల మధ్య ధ్వజారోహణం జరిపారు. ధ్వజపటాన్ని ఎగుర వేస్తూ అష్టదిక్పాలకులు, దేవతలను స్వామివారి కల్యాణానికి ఆహ్వానించారు. కల్యాణోత్సవాలను ఈ ఏడాది ఆరుబయట భక్తుల సమక్షంలో నిర్వహించేందుకు టీటీడీ అధికారులు అనుమతి ఇవ్వడంతో వేలాదిమంది తరలివచ్చారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బారికేడ్లు, క్యూకాంప్లెక్స్‌ల గుండా క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామిని, స్వామివారి ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. మెట్లమార్గం గుండా వెళ్లి కల్కి అవతారంలో వెలసిన స్వామివారి మూలవిరాట్‌ను దర్శించుకున్నారు. ఉదయం 9 గంటల నుంచి భక్తుల సంఖ్య ఒక్కసారిగా పెరిగిపోవడంతో కిలోమీటరు దూరం మేర క్యూలైన్లలో భక్తులు వేచి ఉండాల్సిన పరిస్థితి వచ్చింది.

కమనీయం కన్యావరుణ సంవాదం

కల్యాణ తంతులో భాగంగా శుక్రవారం రాత్రి కన్యావరుణ సంవాదం (ఎదురు సన్నాహ మహోత్సవం) జరిగింది. దీనినే కన్యావాద సంవాదం.. పెళ్లి మాటల తంతుగా పేర్కొంటారు. ఉపమాక సింహాద్రాచార్యులు ఇంటివద్ద జరిగిన ఈ కార్యక్రమానికి భారీగా భక్తజనం తరలివచ్చారు. స్వామివారిని, ఉభయ నాంచారులను ఎదురెదురుగా ఉంచి పెళ్లి మాటలు, కట్నకానుకల కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్రాంత తెలుగు పండిట్ డాక్టర్ వేదాల గాయత్రీదేవి స్వామివారి, అమ్మవార్ల గుణగణాలను, కీర్తి ప్రతిష్టలను వివరించారు. వేంకటేశ్వర స్వామిని ఇత్తడి గరుడ వాహనంపైన, ఉభయ దేవేరులను ఇత్తడి శేషతల్ప వాహనంపై ఉంచి చిన్న వీధి, పెద్దవీధులలో ఊరేగించారు. రథోత్సవాన్ని తిలకించి భక్తులు పులకించిపోయారు.

వడ్డాదిలో వేడుకగా శ్రీవారి కల్యాణం



కనుల పండువగా స్వామి కల్యాణం



మెట్ల మార్గంలో భక్తుల కోలాహలం

బుచ్చెయ్యపేట: వడ్డాది వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం స్వామివారికి ఏకాదశి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త దొండా కన్నబాబు తరఫున హాజరైన శ్రీరామ్ తదితర కుటుంబ సభ్యులకు తొలి దర్శనం కల్పించారు. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి భక్తులు దర్శనం కోసం బారులు తీరారు. ఉదయం ప్రత్యేక పూజలు, హోమాలు, తిరువీధి ఉత్సవం నిర్వహించగా రాత్రికి గిరిజాంబ కొండపైన ఉన్న ఆలయ మండపంలో స్వామివారికి వేడుకగా కల్యాణం నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని దగ్గర నుంచి చూసిన భక్తులు తన్మయం చెందారు. కొండ దిగువన, కొండ వెనుక వేంకటేశ్వరస్వామి అన్నదాన సభ్యులు భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రికి భోజన వసతి ఉచితంగా కల్పించారు. దేవస్థానం ఈవో శర్మ పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

క్లుప్తంగా

470 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

యలమంచిలి: అక్రమంగా తరలిస్తున్న 470 కిలోల రేషన్ బియ్యాన్ని శుక్రవారం యలమంచిలి పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాటా ఏస్ వాహనంలో ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన బియ్యాన్ని కొందరు అక్రమంగా తరలిస్తున్నట్టు సమాచారం రావడంతో పట్టణ పోలీసులు స్థానిక వెంకటేశ్వర థియేటర్ వద్ద ఆ వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. బియ్యం చౌక డిపోలకు చెందినదిగా నిర్ధారించుకున్న తరువాత సరకుతో పాటు వాహనం డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.అనంతరం స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించినట్టు పట్టణ ఎస్ఐ పాపినాయుడు తెలిపారు.నిందితుడిపై 6ఏ కేసు నమోదు చేసి, చర్యలు తీసుకోనున్నట్టు రెవెన్యూ వర్గాలు తెలిపాయి.

మెట్లపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

ఎస్.రాయవరం: మెట్లపై నుంచి జారి పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రం ఎస్.రాయవరంలో నివాసం ఉంటున్న వంగలపూడి దొరబాబు(48) స్నానం చేయడానికి బాత్‌రూమ్‌లోకి వెళ్లి, తిరిగి వస్తున్నప్పుడు గుమ్మం మెట్లవద్ద జారిపడిపోయాడు. తలకు గాయమై, అపస్మారక స్థితికి చేరుకోగా, కుటుంబ సభ్యులు వెంటనే స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ వైద్యుడి వద్ద తీసుకెళ్లారు. అప్పటికే మృతిచెందినట్టు వైద్యుడు చెప్పారు. ఈ మేరకు మృతిడి భార్య నాగలక్ష్మి ఫిర్యాదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ భూలోకరావు శుక్రవారం తెలిపారు.దొరబాబు కాకినాడ జిల్లా తుని మండలం ఎస్.అన్నవరం నుంచి 10 ఏళ్ల కిందట అత్తవారింటికి ఎస్.రాయవరం వచ్చి స్థిరపడ్డాడు.మృతుడికి భార్య,ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ చెప్పారు.

ఆర్థో సర్జన్‌గా గంగాధర్

అనకాపల్లి టౌన్: ఎన్టీఆర్ వైద్యాలయంలో ఆర్థో సర్జన్‌గా జి.గంగాధర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ వైద్యాలయంలో ఈ పోస్టు ఖాళీగా ఉండటంతో రాజమహేంద్రవరం నుంచి ఈయన బదిలీపై వచ్చారు.

సర్వే రాళ్లతో ప్రభుత్వ భూములకు రక్షణ

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



కశింకోట ప్రభుత్వ భూముల్లో సర్వే రాళ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

కశింకోట: ప్రభుత్వ భూముల పర్యవేక్షణకు పకడ్బందీగా సర్వే రాళ్లు అమర్చాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారుల్ని ఆదేశించారు. కశింకోట శారదా నది అవతల ప్రభుత్వ భూమిలో సర్వే రాళ్ల ఏర్పాటును శుక్రవారం ఆయన పరిశీలించారు. వివాదాలకు తావులేకుండా హద్దుల మేరకు సర్వే రాళ్ల ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ఇప్పటికే రీసర్వేలో గుర్తించిన ప్రభుత్వ భూములకు హద్దులు తెలిసేలా వీటిని ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం మండలంలోని తీడ గ్రామంలో పర్యటించారు. అమృత్ సరోవర్‌లో భాగంగా రూ.14 లక్షలతో ఉపాధి హామీ పథకం కింద తవ్విన సాగునీటి చెరువును పరిశీలించారు.

ఈ తవ్వకానికి కేటాయించిన వ్యయం, కూలీల నియామకంపై ఆరా తీశారు. చెరువు తవ్వకంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట జిల్లా నీటి యాజమాన్య సంస్థ అదనపు సంచాలకురాలు రోజారాణి, ఎంపీడీవో కొంకి అప్పారావు, తహసీల్దార్ సురేష్‌నాయుడు, ఉపాధి పథకం ఏపీవో శివ, పంచాయతీ కార్యదర్శి ఎస్.రవి ఉన్నారు.

వలంటీర్ సేవలకు సలామ్..



కశింకోట: కేజీహెచ్‌లో అప్పారావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పైల దేవి



చోడవరం: విశాఖలో ఆస్పత్రికెళ్లి కొండబాబుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ వంశీ



రోలుగుంట: కాలికి గాయమైన ఉర్ల రత్నంకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సంతోషి

- విశాఖలో ఆస్పత్రులకు వెళ్లి పింఛన్ల అందజేత

చోడవరం/కశింకోట/రోలుగుంట: ప్రభుత్వం తమపై ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధ్యతను వలంటీర్లు ఎంతో చిత్తశుద్ధితో నిర్వర్తిస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరికి, అనారోగ్యంతో ఒకరు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరి వద్దకు తమ సొంత ఖర్చులతో వెళ్లి పింఛన్ల సొమ్ము అందజేసి శభాష్ అనిపించుకున్నారు. చోడవరం సచివాలయం -3 పరిధి ఎర్లవీధికి చెందిన గండి కొండబాబు అనే వృద్ధుడు అనారోగ్యంతో విశాఖపట్నం షీలానగర్ డెయిరీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి పరిస్థితి తెలుసుకున్న వార్డు వలంటీర్ గవర వంశీ శుక్రవారం అక్కడకు చేరుకుని రూ. 2750 ఇచ్చారు. వలంటీర్ వంశీ విధి నిర్వహణలో చూపిన ఉదారతను సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు అభినందించారు.

కేజీహెచ్‌కు వెళ్లి...

కశింకోట మండలం కన్నూరుపాలేనికి చెందిన కాండ్ర అప్పారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో గ్రామ వలంటీర్ పైల దేవి తన సొంత ఖర్చులతో అక్కడకు వెళ్లి పింఛన్ అందించింది. ఆమె సేవా నిరతిని ప్రశంసిస్తూ పంచాయతీ కార్యదర్శి ఎస్. సత్యారావు, సచివాలయ సిబ్బంది అభినందించారు.

రాజమహేంద్రవరం వెళ్లి...

రోలుగుంట మండలం కె.నాయుడుపాలెం గ్రామానికి చెందిన ఉర్ల రత్నం కూలీ పనుల కోసం రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి ఈ నెల 1న స్వగ్రామానికి వస్తుండగా, మార్గమధ్యలో ప్రమాదానికి గురై గాయపడింది. ఈ నేపథ్యంలో ఆమె పరిస్థితి తెలుసుకున్న వలంటీర్ అడపా సంతోషి అక్కడకు వెళ్లి శుక్రవారం వితంతు పింఛన్ అందజేసింది. లబ్ధిదారు కృతజ్ఞత తెలిపింది.

రైల్వే ఉద్యోగి ఆత్మహత్య

మద్రిపాలెం (విశాఖ ఉత్తర): ఆర్థిక ఇబ్బందులు తాళలేక విశాఖలోని రైల్వే ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీవీఎంసీ 53వ వార్డు రైల్వే క్వార్టర్స్‌లో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఎయిర్ పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు.. విజయనగరం జిల్లా గజపతినగరానికి చెందిన లక్ష్మణ్ (47) మద్రిపాలెం రైల్వే డీజిల్ లోకోషెడ్‌లో క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో పాటు మద్యానికి బానిసై తరచూ ఇంట్లో భార్యా, పిల్లలతో గొడవలు పడుతుండేవాడు. గురువారం అర్ధ రాత్రి ఒంటిగంటకు ఇంటికి వచ్చి నిద్రపోయాడు. తర్వాత ఇంట్లో ఉన్న పూజ గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. శుక్రవారం ఉదయం భార్యా పిల్లలు చూసేసరికి అక్కడ లేకపోవడంతో అలవాటు ప్రకారం మద్యం సేవించి వేరే గదిలో నిద్రపోతున్నాడని అనుకున్నారు. సుమారు 11 గంటల ప్రాంతంలో అనుమానం వచ్చి తలుపులు కొట్టగా ఎంతకీ తీయకపోవడంతో ఇరుగు పొరుగు సాయంతో తలుపులు బద్దలుకొట్టి చూసేసరికి ఫ్యాను హుక్కుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఎయిర్‌పోర్టు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడికి 9 ఏళ్ల కుమార్తె, 8 ఏళ్ల కుమారుడు ఉన్నారు. ఏఎస్ఐ వాసుదేవరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉక్కు కార్మిక నేతల అరెస్ట్

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసనలు మిన్నంటాయి. కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మెడ్‌టెక్ సందర్శనను నిరసిస్తూ శుక్రవారం కూర్మన్నపాలెం కూడలి వద్ద దీక్ష శిబిరం ముందు రోడ్డుపై ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సభ్యులు ఆందోళన చేపట్టారు. దీంతో వీరిని పోలీసులు అరెస్ట్ చేసి ఎయిర్‌పోర్ట్ పోలీస్‌స్టేషన్ తరలించారు. విషయం తెలుసుకున్న గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఎయిర్‌పోర్ట్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి కార్మిక నేతలను పరామర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతోందని తెలిపారు. మంత్రి రాజశేఖర్, సీహెచ్ సన్యాసిరావు, డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు, రామస్వామి, బొడ్డు పైడిరాజు, పరంధామయ్య, వెంకటరావు, గుమ్మడి నరేంద్ర తదితర నాయకులు అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు.

పసుపు కిలో రూ.60

మద్దతు ధర ప్రకటించిన జీసీసీ

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని గిరిజన రైతులు సాగుచేస్తున్న పసుపు కొనుగోలుకు జీసీసీ యాజమాన్యం మద్దతు ధరను ప్రకటించింది. జీసీసీ ద్వారా పసుపును మద్దతు ధర కొనుగోలుకు గతంలోనే కలెక్టర్ సుమిత్‌కుమార్ నిర్ణయించారు. ఈ మేరకు జీసీసీ అధికారులు యాజమాన్యానికి ఇటీవల నివేదించారు. దీనిపై స్పందించిన ఎండీ కిలో రూ.60 చొప్పున కొనుగోలుకు ఆదేశాలిచ్చారని పాడేరు డీఎం కురుసా పార్వతమ్మ తెలిపారు. నాణ్యమైన తూకంతో అన్ని వారపుసంతలు, డీఆర్ డిపోల్లో కొనుగోలు చేస్తామన్నారు. నగదు కూడా వెంటనే పంపిణీ చేస్తామని ఆమె వివరించారు.

గిరిజన అర్చకులకు శిక్షణ

రాజవొమ్మంగి: ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార గ్రామాల్లో టీటీడీ నిర్మిస్తున్న ఆలయాలకు సంబంధించి సేవలందించే గిరిజనులకు దశల వారీగా అర్చకత్వ శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే మొదటి విడతలో 40 మందికి శిక్షణ ఇచ్చారు. తాజాగా గత నెల 14 నుంచి 28 వరకు రెండో విడతలో 42 మందికి శిక్షణ పూర్తయిందని సమరసతసేవా ఫౌండేషన్ రంపచోడవరం డివిజన్ హిందూ ధర్మ ప్రచారక్ చలుమర్తి విశ్వనాథరెడ్డి తెలిపారు. అనంతగిరి గ్రామానికి చెందిన రామన్నదొర, హుకుంపేటకు చెందిన కొండబాబు, చింతూరుకు చెందిన నాగేశ్వర్రావు, రంపచోడవరానికి చెందిన రామన్నదొర, మారేడుమిల్లికి చెందిన రామన్నదొర, సత్యబాబుదొర శిక్షణ పొందారని వివరించారు. వీరికి శిక్షణ కాలానికి గాను రూ.3 వేల గౌరవ వేతనం టీటీడీ అందజేస్తుందన్నారు.

నౌకల్లో సాంకేతిక పరిజ్ఞానంపై ఓపెన్ హౌస్



నౌకలను సందర్శించేందుకు వచ్చిన పలు పాఠశాలల విద్యార్థులు



ముఖ్యఅతిథిగా హాజరైన కోస్టు గార్డు డీఐజీ యోగేందర్ ధాకా నౌకల కోసం వివరిస్తున్న దృశ్యం

మహారాణిపేట (విశాఖ దక్షిణ): సముద్ర జలాల్లో మత్స్య సంపదను కనిపెట్టేందుకు భారతీయ మత్స్య పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న రెండు నౌకల్లో సాంకేతిక పరిజ్ఞానంపై మత్స్యకారులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. నౌకల్లో ఓపెన్ హౌస్ నిర్వహించారు. మత్స్య షికారి, మత్స్య దర్శిని నౌకల్లో ఉన్న విభిన్నమైన ఫిషింగ్ టెక్నిక్స్, అధునాతన పరికరాలు, ఎలక్ట్రానిక్, ఓషనోగ్రఫీకి సంబంధించిన పరికరాలు ప్రదర్శనలో ఉంచారు. సముద్ర జలాల్లో లభ్యమైన వివిధ రకాల చేపలతోపాటు అరుదైన మత్స్య రాశులను, నౌకా పరికరాలు, అగ్నిమాపక, నావిగేషన్, మత్స్య సంపదకు దోహదపడే చేపల ఆవాసాలను ప్రదర్శించారు. ఓపెన్ హౌస్‌ను కోస్టు గార్డ్ డీఐజీ యోగేందర్ ధాకా ప్రారంభించారు. డాక్టర్ వీఎస్.ప్రభుత్వ కృష్ణా కాలేజీ, విశాఖ డిగ్రీ మహిళా కాలేజీ, ఏవీఎన్ కాలేజీ, డాక్టర్ బుల్లయ్య కాలేజీ, సెయింట్ జోసెఫ్ మహిళా కాలేజీ, బీవీకే కాలేజీ, పాలాక్స్ స్కూలు, జీవీఎంసీ హైస్కూలు (రైల్వే న్యూకాలనీ) విద్యార్థులు 1200 మందికి పైగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర మత్స్యశాఖల అధికారులు, ఆకాశవాణి అధికారులు పాల్గొన్నారని కార్యాలయ ముఖ్యఅధికారి డి.భామిరెడ్డి తెలిపారు.

కళల కీర్తి కిరీటి.. కళాభారతి



పాండవ రాజసూయం పౌరాణిక నాటకంలో ఓ సన్నివేశం

- ఘనంగా వ్యవస్థాపక దినోత్సవం



కళాభారతి వ్యవస్థాపకుడు భగవత్ శంకరశాస్త్రికి నివాళులర్పిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

మద్దిలపాలెం(విశాఖ తూర్పు) : కళలకు నిలయమైన మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియం వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాభారతి వ్యవస్థాపకుడు సుసర్ల సూర్య భగవత్ శంకర్ శాస్త్రి విగ్రహానికి డాక్టర్ పరుచూరి రఘునాథరావు, కళాభారతి ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.రాజు, ట్రస్ట్ ప్రతినిధి పైడా కృష్ణప్రసాద్, త్యాగరాజు ట్రస్ట్ ప్రతినిధి రామ్‌గోపాల్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ త్యాగరాజ స్వామి భక్తులు, సంగీత సాహిత్య ప్రియులైన సుసర్ల సూర్య భగవత్ శంకర్‌శాస్త్రి 1988లో చిన్న హాల్‌ను మద్దిలపాలెంలో నెలకొల్పారన్నారు. ఇది అంచెలంచెలుగా కళాభారతి ఆడిటోరియంగా రూపాంతరం చెందిందన్నారు.

రక్తి కట్టించిన పాండవ రాజసూయం

వేడుకల్లో భాగంగా హైదరాబాద్‌కు చెందిన భగవాన్ శరణం కల్చరల్ అసోసియేషన్ యాప్రాల్ వారిచే పాండవ రాజసూయం పౌరాణిక పద్యనాటకాన్ని అద్భుతంగా ప్రదర్శించి రక్తి కట్టించారు. మల్లాది అచ్యుతరామ శాస్త్రి రచించిన ఈ నాటకానికి డాక్టర్ లక్ష్మీకాంత శర్మ దర్శకత్వం వహించారు.

పలువురు కళాకారులకు సత్కారం

వేడుకల్లో భాగంలో పలువురు కళాకారులను సత్కరించారు. గాత్రంలో కృష్ణ ప్రియ, సునాయన, నృత్యంలో వేదంతం ఎం.ఎస్.ఎస్.వాగ్దేవి ప్రసాద్, కసిరెడ్డి యామిని, మృదంగంలో మల్లాది శివానంద్ యశస్వీలకు, డోలు విభాగంలో పెద్దాడ ప్రసాద్‌లను సత్కరించారు.

అందివచ్చిన కొడుకు..తిరిగిరాని లోకాలకు..

- జీడిమెట్ల ఫార్మా కంపెనీలో ప్రమాదం
- పేలిన రియాక్టర్
- గొమ్ము అయ్యవారిగూడెంకు చెందిన నరేంద్ర తీవ్రంగా గాయపడి మృతి
- పోషించే దిక్కును దూరం చేసిన విధి



కూనవరం: అందివచ్చిన కుమారుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.అర్ధంతరంగా మృత్యువు కబళించడంతో పోషించే దిక్కును కోల్పోయింది. వివరాలిలావున్నాయి. మండలంలోని గొమ్ము అయ్యవారిగూడెం గ్రామానికి చెందిన అరవా శ్రీనివాసరావు, కృష్ణవేణి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉండగా ఆమెకు వివాహమైంది. వీరిలో అరవా నరేంద్ర (26) పాల్వంచ డిగ్రీ కళాశాలలో డిగ్రీ బీఎస్సీ చదువుకున్నాడు. ఏడాది క్రితం వేరే కంపెనీలో పనిచేసిన అతను ఈ మధ్య కాలంలోనే హైదరాబాద్ జీడిమెట్ల పారిశ్రామికవాడలో అరోరా ఫార్మా స్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో కెమిస్ట్‌గా చేరాడు. ఈ నేపథ్యంలో బుధవారం మారినింగ్ షిఫ్ట్‌లో మరో ఉద్యోగితో కలసి ఎంపీ-3 రియాక్టర్‌కు దగ్గరలో విధులు నిర్వహిస్తున్నాడు. ఉదయం 10.30 గంటల సమయంలో యూనిట్-1లో రియాక్టర్ పేలిపోవడంతో భారీ విస్ఫోటనం సంభవించింది. అక్కడే ఉన్న నరేంద్ర, సహచర ఉద్యోగి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని కుటుంబ సభ్యులు తెలిపారు. శుక్రవారం గ్రామానికి మృతదేహం వచ్చింది. జీవితాంతం అండగా ఉండి పోషిస్తానని చెప్పి వెళ్లిన కుమారుడు విగత జీవిగా రావడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. తమకు దిక్కెవరంటూ గుండెలు బాదుకొని విలపించారు. తల్లిదండ్రులు వారపు సంతల్లో కూరగాయలు, ఆకుకూరలు అమ్ముతుంటారు. కుమారుడు నరేంద్ర వీరికి జీవనాధారం. ప్రతినెలా పంపించే డబ్బులతో వారు కాలం గడుపుతున్నారు. ఈ పరిస్థితుల్లో కుమారుడు మృతి చెందడం విధి ఆ కుటుంబాన్ని రోడ్డున పడేసింది.

కానిస్టేబుళ్లపై వాచ్‌మన్ సుత్తితో దాడి





చికిత్స పొందుతున్న కానిస్టేబుళ్లు కృష్ణారావు, కిషోర్

మద్రిపాలెం: అపార్ట్‌మెంట్ వాచ్‌మన్ మద్యం తాగి డ్యూటీలో ఉన్న ఇద్దరి కానిస్టేబుళ్లపై దాడి చేశాడు. ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలివీ.. విమాన్‌నగర్ వద్ద సాయిప్రియ అపార్టుమెంట్‌లో రమ, ఆమె భర్త గోపి కాపలాదారులుగా పనిచేస్తున్నారు. గోపి రాత్రి ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో న్యూడిల్స్ చేస్తుంటాడు. అతనికి మద్యం సేవించే అలవాటు ఉండడంతో తరచూ భార్యతో గొడవ పడుతున్నాడు. రెండు రోజులుగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. గురువారం రాత్రి కూడా గొడవ జరగడంతో.. ఆమె బయటకు వెళ్లి డయల్ 100కి ఫోన్ చేశారు. నైట్‌బీట్‌లో ఉన్న ఎయిర్‌పోర్టు కానిస్టేబుళ్లు కృష్ణ, కిశోర్ వారి నివాసం వద్దకు చేరుకున్నారు. మద్యం మత్తులో ఉన్న గోపిని వివరాల కోసం విచారించారు. ఈ క్రమంలో గోపి కానిస్టేబుళ్లపై సుత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఇద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం సెవెన్ హిల్స్ ఆస్పత్రికి తరలించారు. ఘటనకు కారణమైన గోపిని ఎయిర్‌పోర్టు పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఓ కానిస్టేబుల్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

60 కిలోల గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయి నిందితులతో పోలీసులు

మారేడుమిల్లి : అక్రమంగా తరలిస్తున్న 60 కేజీల గంజాయిని శుక్రవారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేయగా, మరొకరు పరారైనట్టు వారు తెలిపారు. స్థానిక కొత్తకాలనీ వద్ద శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తున్నారు. ఇదే సమయంలో తెలంగాణ రాష్ట్రం వరంగల్‌కు చెందిన వి. రాజు, జగ్గన్న పేటకు చెందిన ఎల్. రవిందర్ ధారకొండ నుంచి గంజాయిని ఆటోలో తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరి నుంచి 60 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ రాము తెలిపారు. ధారకొండకు చెందిన కొర్రా ముకుంద అనే వ్యక్తి పరారైనట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

కొయ్యూరులో ఎనిమిది కిలోలు

కొయ్యూరు: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు వెంటాడి పట్టుకున్నారు. సీఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం చీడిపాలెం శివారులో తనిఖీలు చేపట్టారు. చింతపల్లి నుంచి కాకరపాడు మీదుగా ఏలేశ్వరం వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇరువురు పోలీసులను చూడగానే వెనక్కి తిరిగి పారిపోయేందుకు ప్రయత్నించారు. వెంటనే ఎస్ఐ రాజారావు వారిని వెంబడించి పట్టుకున్నారు. ఎనిమిది కిలోల గంజాయి, స్కూటీ, రెండు మొబైల్ ఫోన్లను వారి నుంచి స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ వివరించారు. పట్టుబడిన వారు కాకినాడకు చెందిన దార నాని, కాశీ దిలీప్‌కుమార్‌గా గుర్తించారు. ఈమేరకు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా

వేడుకగా వెంకన్న ధ్వజారోహణ



ధ్వజారోహణలో అర్చకులు, భక్తులు

అనకాపల్లిటౌన్ : స్థానిక దేవునిగుమ్మం స్వయంభూ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో భాగంగా శుక్రవారం ఆలయంలో ధ్వజారోహణ, మళ్లవరపువారి వీధిలో ఎదురు సన్నాహ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. పిళ్లావారి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో స్వామి కల్యాణోత్సవం కమనీయంగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు పులఖండం గిరిబాబు, విజయబాబు, ఆలయ ఈవో ఆదినారాయణ, అధికారులు జీవీ రమాబాయి, ప్రసాద్‌బాబు, రాజేష్‌బాబు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సమావేశం రేపు

తుమ్మపాల : పట్టణంలోని గవరపాలెం వీవీ రమణ రైతు భారతి కల్యాణమండపంలో ఈ నెల 5న వయోవృద్ధుల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావు(కెప్టెన్) తెలిపారు. వయోవృద్ధుల సంక్షేమం కోసం కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు, వృద్ధుల సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. వయోవృద్ధులంతా సమావేశానికి హాజరుకావాలని కోరారు.

'వంట గ్యాస్ ధర తగ్గించాలి'



వంటగ్యాస్ ధర తగ్గించాలని నినాదాలు చేస్తున్న ఆప్ నాయకులు

తుమ్మపాల : పెంచిన వంటగ్యాస్(సిలిండర్) ధరలను కేంద్రప్రభుత్వం వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తు ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) నాయకులు నెహ్రూచౌక్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ధర్నాకు దిగారు. నిత్యావసరాలైన గ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ కేంద్రం పేదప్రజలు నడ్డివిరుస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ దేశాన్నీ కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే పనిలో ప్రభుత్వం ఉందని ఆక్షేపించారు. సంపన్నులకు మేలు చేస్తూ, సామాన్యుల్ని ఇబ్బంది పెట్టేలా వ్యవహరిస్తోన్న కేంద్ర ప్రభుత్వం తీరు మారాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు, నాయకులు సీహెచ్ శ్రీనివాసరావు, ఎం.జగన్నాథరావు, పి.బాబ్జి, ఎస్.అప్పారావు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

సార్	రాజా
కోనసీమ	సత్యనారాయణ స్క్రీన్-1
సాచి	సత్యనారాయణ స్క్రీన్-2
వినరో భాగ్యము విష్ణుకథ	షిర్డిసాయి
బలగం	పర్తిసాయి
ఆర్గానిక్ మామ హైబ్రిడ్ అల్లుడు	వెంకటేశ్వర
బిగ్ స్నేక్ కింగ్	శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	రామచంద్ర

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 5,861 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,410	4,000
మొదటి రకం	3,470	3,670
రెండో రకం	3,140	3,460
మూడో రకం	2,920	3,130

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 44 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-21 యూనిట్లు, ఓ పాజిటివ్-12 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 341 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 511 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

బడిపిల్లలకు 'జావ'సత్తువలు

- వారంలో మూడు రోజులు బ్రేక్ ఫాస్ట్‌గా రాగిమాల్ట్
- మండలంలో 11,502 మంది విద్యార్థులకు లబ్ధి
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిశాక అమల్లోకి



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు



సీతానగరం స్కూల్లో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

పిల్లలు ఆసక్తిగా చదువుకోవాలంటే వారికి ఆకలి బాధ తెలియకూడదు. నేటి బాలలే రేపటి పౌరులు.. ఈనాటి వారి ఆరోగ్యమే రేపటి దేశానికి బలం' అని నమ్మి పాలన సాగిస్తున్న ప్రజానాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. అందుకే బడి పిల్లలకు అందించే మధ్యాహ్న భోజన పథకంలో సరికొత్త మార్పులు తీసుకొచ్చారు. సాధారణ మధ్యతరగతి కుటుంబంలోని పిల్లలు కూడా పొందలేని స్థాయిలో జగనన్న గోరుముద్దను అందిస్తున్నారు. పోషక విలువలు పూర్తి స్థాయిలో అందేలా.. నాణ్యమైన, కమ్మని వంటకాలతోపాటు సంతృప్తిగా విద్యార్థుల కడుపు నిండేలా కృషి చేస్తున్నారు.

అనకాపల్లి రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవాత్మక మార్పులకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చదివేందుకు ఆసక్తి చూపేలా పాఠశాలల్ని తీర్చిదిద్దుతోంది. ఆ ప్రయత్నాల్లో భాగమే జగనన్న అమ్మఒడి, మన బడి నాడు-నేడు, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద తదితర పథకాలు. ఇపుడు జగనన్న గోరుముద్దకు అదనపు పోషకాలను జత చేస్తోంది. విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్‌గా రాగిమాల్ట్(జావ)ను అందించనుంది.

ఎమ్మెల్సీ కోడ్‌తో అమలుకు బ్రేక్

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి సంపూర్ణ పోషకాహారం అందించాలన్న దృఢ సంకల్పంలో భాగంగా మధ్యాహ్న భోజనంలో ప్రభుత్వం చాలా మార్పులు చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు జగనన్న గోరుముద్ద పథకం ద్వారా సంపూర్ణ పోషకాహారం అందిస్తున్నారు. దీనికి అదనంగా మంగళ, గురు, శని వారాల్లో బ్రేక్ ఫాస్ట్‌గా రాగిజావ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత ఈ నెల 2వ తేదీ నుంచి దీన్ని అమలు చేయాలనుకున్నారు. అయితే రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో తాత్కాలికంగా వాయిదా వేశారు. కోడ్ ముగిసిన వెంటనే విద్యార్థులకు రాగిజావ అందించనున్నారు.

గోరుముద్దలో పోషకాలు లోడింగ్

జగనన్న గోరుముద్దలో భాగంగా వారంలో మూడు రోజులు బ్రేక్‌ఫాస్ట్ రూపంలో ఇవ్వనున్న రాగిజావ కోసం ప్రభుత్వమే రాగిపిండి, బెల్లం సరఫరా చేయనుంది. రాగిజావతో విద్యార్థుల్లో ఐరన్, కాల్షియం లోపాలను అధిగమించే వీలుంది. నాణ్యతలో రాజీ పడకుండా విద్యార్థులకు కమ్మని భోజనం ఏర్పాటుతో ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్ల సంఖ్య తగ్గిందని అధికారులు చెప్తున్నారు. విద్యార్థుల అభిరుచులకు తగ్గట్టు ఇప్పటికే మూడుసార్లు మెనూలో మార్పులు చేశారు. దీనికి తోడు మధాహ్న భోజనంలో కోడిగుడ్లను పెంచారు. అదనంగా వేరుశనగ చిక్కీలను కూడా అందిస్తున్నారు. ఇపుడు రాగిజావ పిల్లల ఆరోగ్యానికి మరో బోనస్‌గా మారనుంది.

మండలంలో పరిస్థితి

అనకాపల్లి మండలంలో ఉన్న 107 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. ప్రభుత్వ, మండల పరిషత్, ఎయిడెడ్ యాజమాన్యాల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 11,502 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని తీసుకుంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం మధ్యాహ్న భోజనాన్ని చిత్త శుద్ధితో అమలు చేస్తోంది. విద్యార్థుల్లో పోషకాహార లోపాలను అధిగమించి, ఆరోగ్యకరమైన సమాజం ఏర్పాటు చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం.

జగనన్న గోరుముద్ద మెనూ

సోమవారం: వెజ్ పలావు, గుడ్డు కూర, చిక్కీ
మంగళవారం: పులిహోర, టమాటా పప్పు, గుడ్డు
బుధవారం: వెజ్ బిర్యానీ, ఆలూ కుర్మా, గుడ్డు, చిక్కీ
గురువారం: లెమన్ రైస్(కిచిడి), టమాటా చట్నీ, గుడ్డు
శుక్రవారం: అన్నం, ఆకుకూర పప్పు, గుడ్డు, చిక్కీ
శనివారం: అన్నం, సాంబార్, స్వీట్ పొంగల్

రాగిజావ అందించేందుకు చర్యలు



మధ్యాహ్న భోజన పథకంలో బ్రేక్ ఫాస్ట్‌గా రాగి జావను అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. త్వరలో దీన్ని అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నాం. రాగి జావ తయారు చేసేందుకు ప్రభుత్వమే నాణ్యమైన రాగి పిండి, బెల్లం సరఫరా చేస్తుంది. మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులే రాగిజావని తయారుచేసి అందించాల్సి ఉంటుంది. విద్యార్థుల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం.

– డి దివాకర్, ఎంఈవో, అనకాపల్లి

పోషకాలు పుష్కలం



ఆరోగ్యకరమైన తృణ ధాన్యాల్లో రాగులు ఒకటి. రాగి పిండిలో కాల్షియం ఎముకల దృఢత్వానికి ఎంతో ఉపయోగకరం. వేరుశనగ, నువ్వులు, ఆకుకూరలు, గుడ్డుతో పాటుగా రాగి పిండిలో ఐరన్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ఇవి విద్యార్థులకు శక్తినిస్తాయి. పిల్లల్లో ఎదుగుదలకు రాగి జావ ఎంతగానో ఉపయోగపడుతుంది. రక్తహీనతను నివారిస్తుంది. వేసవిలో రాగిజావ శరీరానికి చల్లదనాన్నిస్తుంది.

– జి.పావని, పీహెచ్‌సీ వైద్యాధికారి, తగరంపూడి

వెలంపేట గౌరమ్మ ఉత్సవం నేడు



వెలంపేట గౌరీపరమేశ్వరులు



సంతబయల ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ

కశింకోట : స్థానిక వెలంపేట గౌరీపరమేశ్వరుల (గౌరమ్మ) ఉత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించేందుకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఏటా ఆనవాయితీగా జరిగే ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. సాయంత్రం నేల వేషాలతో గౌరమ్మ ఊరేగింపు ప్రారంభమై గ్రామ ప్రధాన వీధుల్లో కొనసాగుతుందన్నారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెద్ద ఎత్తున బాణ సంచా విన్యాసాలుంటాయని పేర్కొన్నారు. ఉత్సవం అనంతరం శారదానదిలో గౌరమ్మను ఆదివారం నిమజ్జనం చేయనున్నట్లు వెల్లడించారు.

విద్యుత్ అలంకరణలో వీధులు

ఉత్సవం పురస్కరించుకుని సంతబయల పంచాయతీ ప్రధాన రహదారిలో ముందుగానే విద్యుద్దీపాలంకరణ చేశారు. పందిరి లైటింగ్, దేవతామూర్తులు, ఇతర కటౌట్లతో వీధుల్ని అందంగా మలిచారు. రిక్షాస్టాండ్ వద్ద మిరుమిట్లు గొలిపేలా ప్రవేశ ద్వారాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఒక రోజు ముందుగానే ఉత్సవ వాతావరణం నెలకొంది.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న బీజేపీ నేతలు

అనకాపల్లిటౌన్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల్లో బీజేపీ బలపరచిన అభ్యర్థి పీవీఎన్ మాధవ్‌కు మద్దతుగా ఆ పార్టీ నేతలు గవరపాలెంలో శుక్రవారం ప్రచారం చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి బీజేపీ మద్దతు అభ్యర్థిని గెలిపించాల్సిందిగా ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు కొణతాల అప్పలరాజు, వుడా రమేష్, బొడ్డేడ నాగేశ్వరరావు, వి.నర్సింగ్‌యాదవ్ పాల్గొన్నారు.

మేకల కాపరికి గాయాలు

అనకాపల్లిటౌన్ : వి.మాడుగుల మండలం బొప్పలపాలెం గ్రామానికి చెందిన సాగి పట్నాలమ్మ మేకలను మేతకు తీసుకెళ్తూ గురువారం గాయపడింది. బాధితురాలు కత్తితో మేకలకు మేతగా చెట్టుకొమ్మలను కోస్తుండగా, తెగిపడ్డ కొమ్మ ఆమె తొడభాగంలో గుచ్చుకుపోయింది. కుటుంబసభ్యులు హుటాహుటిన స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో చేర్చారు. మెరుగైన చికిత్సకోసం శుక్రవారం విశాఖ కేజీహెచ్‌కు ఆమెను తరలించినట్లు వైద్యులు తెలిపారు.

వైరల్ జ్వరాల కట్టడికి చర్యలు

- జిల్లా మలేరియా అధికారి వరహాలుదొర



గ్రామ పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి వరహాలుదొర

పరవాడ : వైరల్ ఫీవర్స్‌తో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు జరిపి జ్వరాలను అరికట్టడానికి తక్షణ చర్యలు చేపట్టాలని అనకాపల్లి జిల్లా మలేరియా అధికారి వరహాలుదొర స్థానిక వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన తానాం రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి వైరల్ జ్వరాలతో బాధపడుతున్న విద్యార్థులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన మందులు అందించి జ్వరాలు తగ్గు ముఖం పట్టే విధంగా చూడాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో కాలువలు, చెత్తా చెదారాల తొలగించడానికి పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మురుగు కాలువలు, అపరిశుభ్ర ప్రదేశాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో దోమల నివారణ కోసం మందులు పిచికారీ చేయించాలన్నారు. విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పరవాడ పీహెచ్‌సీ వైద్యాధికారులకు వరహాలుదొర హెచ్చరించారు. ఆయన వెంట తానాం సర్పంచ్ కన్నూరిదేవి వెంకటరమణ, పరవాడ ప్రభుత్వ వైద్యాధికారి ఐ.ఆర్.రంజిత్, మలేరియా సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సర్వసభ్య సమావేశం రేపు

పరవాడ : స్థానిక మరిడిమాంబ కల్యాణ మండపంలో ఆదివారం విశ్రాంత ఉద్యోగుల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం జనరల్ కార్యదర్శి వి.వి.దీక్షితులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని విశ్రాంత ఉద్యోగులంతా పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు, డెంటల్ క్లీనిక్ ఆధ్వర్యంలో దంత పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. విశ్రాంత ఉద్యోగులంతా తమ ఆధార్ కార్డులు, సెల్ ఫోన్లను వెంట తీసుకు రావాలని కోరారు.

ప్రకృతి సేద్యం బృందం పర్యటన నేడు

సబ్బవరం : మండలంలోని అమృతపురం గ్రామంలో ప్రకృతి సేద్యాన్ని రిటైర్డ్ ఐఏఎస్ విజయ కుమార్‌తో పాటు సత్య త్రిపాఠి బృందం శనివారం పరిశీలించనుందని అనకాపల్లి డీపీఎం సీహెచ్ లచ్చన్న శుక్ర వా రం ఒక ప్రకటనలో తెలి పారు. క్షేత్ర పరిశీలన తర్వాత సచివాలయంలో రైతులు, మహిళా సంఘాలతో సమావేశ మై ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను సమీక్షించనున్నారు. రసాయనిక రైతులకు ప్రకృతి వ్యవసాయం సాగు తీరుపై సమగ్రంగా అవగాహన కల్పించనున్నారు.

త్వరితగతిన ఆధార్ అనుసంధానం

- బీఎల్‌వోలకు ఆర్డీవో చిన్నికృష్ణ ఆదేశం



బీఎల్‌వోలతో సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లి రూరల్ : ఓటరు జాబితాలకు ఆధార్ అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేయాలని అనకాపల్లి ఆర్డీవో ఏజీ చిన్నికృష్ణ బీఎల్‌వోలను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో అనకాపల్లి, కశింకోట మండలాల బీఎల్‌వోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపడుతున్న ఓటరు జాబితాలకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ ఆశించిన స్థాయిలో చురుగ్గా జరగడంలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై బీఎల్‌వోలంతా త్వరితగతిన ఈ ప్రక్రియ పూర్తయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఇందుకు అవసరమైన 6బీ ఫారాల సేకరణను వేగవంతం చేయాలన్నారు. ముఖ్యంగా వలస ఓటర్లు, డబుల్ ఎంట్రీలు, బోగస్ ఓట్ల ఏరివేత పూర్తయ్యేలా చూడాలన్నారు. శతశాతం పూర్తికి బీఎల్‌వోలంతా కృషి చేయాలన్నారు. తరచూ దీనిపై సమీక్షించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పలువురు బీఎల్‌వోలు క్షేత్ర స్థాయిలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆర్డీవో దృష్టికి తెచ్చారు. సమస్యల్ని అధిగమించి ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా అనుసంధాన ప్రక్రియ పూర్తి చేయాల్సిన బాధ్యత బీఎల్‌వోలపై ఉందన్నారు. సమీక్షలో అనకాపల్లి తహసీల్దార్ గంగాధరరావు, ఎంపీడీవో ధర్మారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో సుధాకర్ విజయం తథ్యం



తుమ్మపాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దంతులూరి దిలీప్ కుమార్



ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నేతలు

అనకాపల్లి రూరల్ : వైఎస్సార్‌సీపీ మద్దతుతో పట్టభద్రుల స్థానానికి పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్ విజయం తథ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని తుమ్మపాల మేజర్ పంచాయతీలో శుక్రవారం ఆయన స్థానిక పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో విప్లవాత్మక మార్పులతో సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని, ఆయన పాలనకు పట్టభద్రులంతా బాసటగా నిలవాలని కోరారు. సీఎం జగన్ పాలనే రాష్ట్రంలో ఏ ఎన్నికలు జరిగినా తమ పార్టీ అభ్యర్థుల్ని భారీ మెజార్టీతో గెలిపిస్తుందన్నారు. కార్యక్రమంలో తుమ్మపాల గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్యనాయుడు, ఎంపీటీసీలు పంచదార్ల కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి, ఆర్టీసీ సత్యనారాయణ, న్యాయవాది హర శ్రీనివాసరావు, దంతులూరి కల్యాణ చక్రవర్తి, వైస్ ప్రెసిడెంట్ సదరం చిన్న, వార్డు సభ్యులు రవ్వ భవానీశ్రీను, మాదిబోయిన నాగరాజు, రామారావు, వెలగా నూకరత్నం, మోదినాయుడు, సత్యనారాయణ, శ్రీలక్ష్మి, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిటౌన్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు గెలిపించాలంటూ ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు ఓటర్లను కోరారు. 81వ వార్డు పరిధిలోని గాంధీనగరంలో పార్టీ నేతలతో కలిసి శుక్రవారం ఆయన ప్రచారం చేశారు. మొదటి ప్రాధాన్యత ఓటు సుధాకర్‌కు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కరపత్రాలు అందిస్తూ కోరారు. ఈ ప్రచారంలో వైద్యుడు రామ్మూర్తి, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, మహిళా విభాగం అధ్యక్షురాలు ఏవీ రత్నకుమారి, మాజీ కౌన్సిలర్ కొణతాల మురళీకృష్ణ, పార్టీ నాయకులు కొండూరి రవీంద్రనాథ్, ఆకుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకమహాలక్ష్మి తీర్థం



డాక్టర్ విష్ణుమూర్తిని సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు



పూలమాలలతో కనకమహాలక్ష్మికి అలంకరణ

కశింకోట : మండలంలోని బయ్యవరం గ్రామంలో శుక్రవారం కనకమహాలక్ష్మి తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని, అమ్మవారిని పూలతో అందంగా అలంకరించారు. వేద మంత్రాల నడుమ కుంకుమార్చనలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాల ప్రజలు కూడా పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు సేవించారు. ఎంపీ బీవీ సత్యవతి భర్త డాక్టర్ కె.విష్ణుమూర్తి అమ్మ వారిని దర్శించుకుని, పూజలు చేశారు. ఆయనకు ఉత్సవ కమిటీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు ఆలయ మర్యాదలతో దుశ్శాలువా కప్పి, జ్ఞాపికతో సత్కరించారు. మధ్యాహ్నం భారీగా అన్న సమారాధన జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా రాత్రి ఏర్పాటు చేసిన శక్తి స్వరూపిణి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గొన్నా నాగసత్యనారాయణ, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గొల్లవిల్లి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

డీపీవో ఆకస్మిక పర్యటన



తుమ్మపాల డంపింగ్ యార్డులో డీపీవో

అనకాపల్లి రూరల్ : మండలంలోని తుమ్మపాల మేజర్ పంచాయతీలో శుక్రవారం డీపీవో ఆర్.శిరీషారాణి ఆకస్మికంగా పర్యటించారు. వెంకుపాలెం రహదారి పక్కనున్న డంపింగ్‌యార్డును పరిశీలించారు. చెత్త తరలింపు ప్రక్రియ ఎప్పటికప్పుడు సక్రమంగా జరుగుతున్నదీ లేనిదీ ఆరాతీశారు. డంపింగ్ యార్డుకు సంబంధించి కొత్తగా నిర్మించిన వాచ్‌మెన్ రూంను, నేమ్ బోర్డును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు స్థలం, పరిసరాలు ఆక్రమణలకు గురికాకుండా పటిష్ట భద్రత చేపట్టాలని, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఈవో కె.శ్రీనివాసరావును ఆదేశించారు. బొజ్జన్న కొండకు వెళ్లే రహదారిలో టైర్ల పంక్చర్ షాపు నిర్వాహకుడు రోడ్డుపై అడ్డంగా టైర్లు పెట్టిన విషయాన్ని గమనించారు. వాటిని తొలగించాల్సిందిగా సిబ్బందిని సూచించారు. గతంలో జిల్లా కలెక్టర్ కూడా దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ సమయంలో తొలగించినా మళ్లీ యథాస్థితి కొనసాగడంతో స్థానిక అధికారుల పర్యవేక్షణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో అప్పటికప్పుడు ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది టైర్లను తొలగించారు. పంచాయతీ పరిధిలో పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పర్యటనలో ఆమె వెంట ఎంపీడీవో కె.ధర్మారావు, ఈవో కె.శ్రీనివాసరావు, సిబ్బంది సత్యనారాయణ, ఫణికుమార్, ఈశ్వరరావు ఉన్నారు.

గుర్రాల అత్యవసర సమావేశం!



గ్రామ పెద్దలు నిర్వహించే రచ్చబండ సమావేశాల్ని పల్లెల్లో చూసే ఉంటాం. అయితే గుర్రాల రచ్చబండను మీరెపుడైనా చూశారా? అయితే ఈ చిత్రాన్ని చూడండి. కశింకోట మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఈ విచిత్రం చోటు చేసుకుంది. మండల పరిషత్ కార్యాలయానికి వివిధ పనుల మీద వచ్చే ప్రజలు నిరీక్షించేందుకు వీలుగా కానుగ చెట్టు చుట్టూ సిమెంట్ చప్టా నిర్మించారు. సీఎం జగనన్న పాలనలో సచివాలయాల్లోనే చాలా పనులు పూర్తవడంతో ఈ రచ్చబండ ఖాళీగా మారిందనుకుని స్థానిక గుర్రాలు ఎండకు చెట్టు కిందికి చేరాయి. వాటిలో ఒక గుర్రం చప్టా పైకి చేరి రచ్చబండపై తీర్పు చెబుతున్నట్లు దర్జాగా నిల్చుంది. దాని మాటల్ని శ్రద్ధగా, ఆసక్తిగా వింటున్నట్లు కింద గుర్రాలు కొంతసేపు నిరీక్షించాయి. దీంతో ఈ సంఘటన చూసిన స్థానికులు గుర్రాలు రచ్చబండ నిర్వహించుకుంటున్నాయని సరదాగా వ్యాఖ్యానిస్తూ ఫొటోలు తీసుకున్నారు.

– కశింకోట